క్లుప్తంగా

వీరాంజనేయస్వామి దేవస్థానంలో ప్రతిష్ఠా మహోత్సవ పూజలు

సత్తెనపల్లి: పట్టణంలోని వడ్డవల్లి వీరాంజనేయస్వామి వారి దేవస్థాన జీవధ్వజ ప్రతిష్ఠా మహోత్సవం మూడు రోజుల పాటు జరగనున్న నేపథ్యంలో అంకురార్పణ పూజలు బుధవారం భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఉదయం 6 గంటల నుంచి పూజలు ప్రారంభించారు. విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, మృత్సంగ్రహణ, అంకురారోపణ, నవగ్రహ పూజ, అగ్ని ప్రతిష్ఠాపన, ఉక్త హోమాలు, పారమాత్మిక హోమాలు, నవగ్రహ హోమం, నీరాజనం, మంత్రం పుష్పం చేపట్టారు. ఉదయం 8 గంటల నుంచి విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, అఖండ స్థాపన, పంచగవ్య ఆరాధన, పంచగవ్య ప్రాసన, ఆచార్య ఋత్విగ్వరణ, యజమాన దీక్షారాధన, వాస్తు పూజ, వాస్తు పర్యగ్నీకరణ, అకల్మష హోమం భక్తిశ్రద్ధలతో చేపట్టారు. కార్యనిర్వహణాధికారి సనిమెళ్ళ కోటిరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఘనంగా మహిళా ఉద్యోగులకు సన్మానం



నకరికల్లు: మహిళలు పట్టుదలతో పనిచేస్తే అన్ని రంగాల్లో ముందంజలో నిలువవచ్చని సీడీపీఓ శ్రీలత అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. మహిళా పోలీస్ రషీదా, ఏఎన్ఎం జ్యోతి, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎం.వి.లక్ష్మి, పద్మావతి, మాణిక్యంలను ఈ ఏడాది ఉత్తమ ఉద్యోగులుగా గుర్తించి శ్రీరామ్ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో దుశ్శాలువాలు, పూలమాలలు, మెమెంటోలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలకు ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలు, రిజర్వేషన్‌లను సద్వినియోగం చేసుకొని పురోగతి వైపు దృష్టి సారించాలని సూచించారు. ఎంచుకున్న రంగాల్లో దేశం గర్వించదగిన స్థాయికి ఎదిగిన మహిళల సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ సంతోషకుమారి, సూపర్‌వైజర్‌లు రమీజున్, నాగమణి, ఆనందకుమారి, ఈఓపీఆర్డీ కె.వి.శివప్రసాద్, ఫౌండేషన్ ప్రతినిధులు వేల్పుల కోటేశ్వరరావు, ప్రకాశరావు, చెన్నంశెట్టి శ్రీనివాసరావు, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడికి ముప్పు

- 117 జీవో రద్దు పేరిట కూటమి సర్కార్ కొత్త ఎత్తుగడ
- హైస్కూళ్లలో విలీనం కానున్న ప్రాథమికోన్నత పాఠశాలలు
- బడికి దూరం కానున్న పేద విద్యార్థులు



దిడుగు ప్రాథమికోన్నత పాఠశాల

అమరావతి: మండలంలోని ఉంగుటూరు, దిడుగు, అమరావతి ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఒకటి నుంచి 7వ తరగతి వరకు చదువుకునే విద్యార్థులున్నారు. ఈ పాఠశాలలు ప్రైమరీ స్కూళ్లుగా మారనున్నాయి. దీంతో 6, 7 చదవాలనుకున్న విద్యార్థులు హైస్కూల్స్‌కు మారాల్సి ఉంటుంది. 117 జీవో రద్దుపై కూటమి ప్రభుత్వం తీసుకునే నిర్ణయంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పేలా లేవు. సర్కారు బడులను అభివృద్ధి చేయాల్సింది పోయి విలీనం పేరుతో పేద విద్యార్థులను బడికి దూరం చేస్తుంది.

మరచిన హామీలు

గతంలో ప్రతి పల్లెలో 3 కిలోమీటర్ల పరిధిలో ప్రాథమికోన్నత, 5 కిలోమీటర్ల పరిధిలో ఉన్నత పాఠశాలలు నడుస్తున్నాయి. అయితే ప్రస్తుత ప్రభుత్వ నిర్ణయాలు సర్కారు బడులలో విద్యార్థులకు ఇబ్బంది కలిగించేలా ఉన్నాయని విద్యారంగ నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. విలీనం ప్రక్రియను ఉపాధ్యాయ సంఘాలు, తల్లిదండ్రులు వ్యతిరేకించటంతో విలీనం చేయడం లేదని హామీ ఇచ్చి మరలా విలీన ప్రక్రియ చేపడితే విద్యార్థులు వేరే గ్రామాలకు వెళ్లి చదవాల్సిన పరిస్థితి కనబడుతుంది. డ్రాపౌట్స్ శాతం పెరిగే ప్రమాదముంది. వేరే గ్రామాల్లో చదువుకోవాల్సి వస్తే తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపే అవకాశమూ లేకపోలేదు. మండలంలో ప్రస్తుతం 35 ప్రాథమిక, 5 ప్రాథమికోన్నత, 5 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 1 నుంచి 5వ తరగతి వరకు 1,677 మంది, 6, 7, 8– 1,172 మంది, 9, 10– 604 మంది విద్యనభ్యసిస్తున్నారు.

విలీనం ఇలా...

ఏకోపాధ్యాయ పాఠశాలలను గుర్తించాలని విద్యాశాఖను ఇప్పటికే ప్రభుత్వం ఆదేశించింది. 60 మంది విద్యార్థులు ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలలను మోడల్ ప్రైమరీ పేరుతో మార్చేందుకు కసరత్తు చేస్తున్నారు. ఈ మోడల్ ప్రైమరీ (ఆదర్శ) పాఠశాలలు ఎక్కడెక్కడ అవసరమని కసరత్తు చేపడుతున్నారు. దీంతో మండలంలోని దిడుగు, ఉంగుటూరు, అమరావతి ప్రాథమికోన్నత పాఠశాలలు ప్రాథమిక పాఠశాలలుగా మారటం ఖాయంగా కనబడుతుంది. ఇందులో దిడుగు పాఠశాల విద్యార్థులు సుమారు 4 కిలోమీటర్ల దూరంలోని మల్లాది జెడ్పీ హైస్కూల్‌కు, ఉంగుటూరు నుంచి 4 కిలోమీటర్ల దూరంలో ఉన్న మండెపూడి జెడ్పీ హైస్కూల్‌కు గానీ, 3 కిలోమీటర్లలోని లేమల్లె పాఠశాలకు గానీ వెళ్లాలి. అలాగే అమరావతి జేబీ స్కూల్ విద్యార్థులు శ్రీరామకృష్ణా హిందూ హైస్కూల్‌కు వెళ్లాల్సి ఉంటుంది.

గ్రామాల్లో నామ మాత్రంగా

మండలంలో ఉన్న ప్రాథమిక పాఠశాలల్లో 1 నుంచి 5వ తరగతి వరకు 20 మంది పిల్లలు ఉన్న ప్రైమరీ పాఠశాలల్లో ఒకే ఉపాధ్యాయుడిని నియమించేలా ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. అలాగే పాఠశాల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని కూడా పాఠశాలలో నిర్వహించాల్సి ఉంటుంది. దీని వల్ల అంగన్‌వాడీ చిన్నారులకు, గర్భిణులకు అంగన్‌వాడీ కేంద్రం దూరమయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం 13 గ్రామాల్లో మోడల్ స్కూల్ పేరిట పాఠశాలల్లో పిల్లలను చేర్చుకోవటానికి రంగం సిద్ధం చేస్తున్నారు. దీంతో ఆయా గ్రామాల్లో మిగిలిన పాఠశాలలు ఫౌండేషన్ స్కూల్స్ పేరిట నామ మాత్రమయ్యే ప్రమాదముంది. ఎస్సీ, బీసీ కాలనీల విద్యార్థులు కూడా మోడల్ స్కూల్స్‌లో చేరాలంటే దూరం వెళ్లాల్సిందే.

నాడు-నేడు
అభివృద్ధి వృథాయేనా..?

మండలంలో దిడుగు ప్రాథమికోన్నత పాఠశాలను రూ.35–40 లక్షలతో, ఉంగుటూరు ప్రాథమికోన్నత పాఠశాలకు సుమారు రూ.10 లక్షలు, అమరావతి జేబీకి రూ.6 లక్షలు నాడు-నేడు కింద నిధులు కేటాయించి అదనపు తరగతి గదులు ఇతర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. ప్రస్తుతం ఈ పాఠశాలలను ప్రాథమిక పాఠశాలలుగా మారిస్తే చేసిన అభివృద్ధి వృథా అవుతుందని తల్లిదండ్రులు అభిప్రాయ పడుతున్నారు.

ప్రైవేటు బడులకు వెళతారు



ప్రభుత్వం హామీకి విరుద్ధంగా విలీన ప్రక్రియ చేపడుతోంది. 117 జీఓను రద్దు చేస్తామంటున్నారు. జీవోలో లోపాలు ఉంటే సరిచేయాలి. మరలా కొత్త విధానం అమల్లోకి వస్తే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గే ప్రమాదముంది. గతంలో ప్రభుత్వ పాఠశాలలు, ప్రైవేటు పాఠశాలలతో పోటీ పడాలని విద్యా విధానంలో మార్పులు తెచ్చారు. ప్రస్తుత ప్రతిపాదిత విలీన ప్రక్రియతో గ్రామీణ ప్రాంతాల్లో డ్రాపౌట్స్ పెరిగి ప్రైవేటు బడులకు వెళ్లిపోతారు.

– ఓ.వి రామిరెడ్డి, మాజీ ఎంఈవో, అమరావతి

నడిచి వెళ్లాల్సిందే



మా ఊళ్లో ఉన్న ఆరు, ఏడు తరగతులను మల్లాది జెడ్పీ హైస్కూల్‌కు మారుస్తామంటున్నారు. ప్రతి రోజు మల్లాది హైస్కూల్‌కు వెళ్లాలంటే 3 కిలోమీటర్లు బస్‌లో వెళ్లి అక్కడి నుంచి కిలోమీటరు ఎండైనా, వానైనా నడిచి వెళ్లాల్సి వస్తుంది. పేద పిల్లలు ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేసుకోలేని పరిస్థితి. దిడుగు ప్రాథమికోన్నత పాఠశాలను మార్చవద్దని కోరుకుంటున్నాను.

– వింతా శివనాగిరెడ్డి, దిడుగు, అమరావతి మండలం

ఘనంగా సీతారాముల కల్యాణం

గోళ్లపాడు(ముప్పాళ్ళ): మండలంలోని గోళ్లపాడు గ్రామంలో వేంచేసియున్న ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం వార్షికోత్సవంలో భాగంగా బుధవారం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నదీ జలాలు, పంచామృతాలతో అభిషేకం, హనుమత్ వ్రతం నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం ఆలయంలో సీతారాముల కల్యాణ మహోత్సవం నిర్వహించారు. అనంతరం రామచంద్ర స్వామి మహాసామ్రాజ్య పట్టాభిషేక కార్యక్రమం నిర్వహించారు.

ఘనంగా హోసన్న మందిరం ప్రారంభోత్సవం



హోసన్న మందిరం ప్రారంభిస్తున్న దైవజనులు

అమరావతి: విశ్వాసుల నామ స్మరణలతో, క్రీస్తు గీతాలాపనలతో భక్తిశ్రద్ధలతో ప్రార్థనల నడుమ బుధవారం రాత్రి మండల పరిధిలోని లేమల్లె గ్రామం హోసన్న దయాక్షేత్రంలో హోసన్న మందిరం ప్రారంభించారు. చెన్నైకి చెందిన దైవజనులు మోహన్‌సీ లాజరస్, దక్షిణాఫ్రికాలో దైవజనులు జాషువా మోజెస్, హోసన్న మినిస్ట్రీస్ అధ్యక్షుడు అబ్రహాం, చీఫ్ పాస్టర్ జాన్‌వెస్లీ, దైవజనులు రమేష్, రాజు, పాల్, అనీల్ తదితరులు ప్రార్థనలు చేసి రిబ్బన్ కత్తిరించి హోసన్న మందిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చీఫ్ పాస్టర్ జాన్‌వెస్లీ మాట్లాడుతూ సుమారు 5 వేల మంది ప్రార్థనలు నిర్వహించుకునే విధంగా సువిశాల మందిరం నిర్మించామన్నారు. ఈ మందిరంలో గుడారాల పండుగ రోజుల్లోనే కాకుండా మిగిలిన రోజులలో కూడా ప్రార్థనలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రం నలుమూలల నుంచి హోసన్న విశ్వాసులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి క్విజ్ పోటీలు

పెదకూరపాడు : పల్నాడు జిల్లాలోని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల విద్యార్థులకు జిల్లా స్థాయిలో స్కాలర్‌షిప్ టెస్ట్, క్విజ్ పోటీలు 'రాంసా' అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతాయని సంస్థ కన్వీనర్, 75 త్యాళ్ళూరు హైస్కూల్ ప్లస్‌లో కెమిస్ట్రీ డిపార్టుమెంట్‌లో పనిచేస్తున్న బి.వెంకటరమణ బుధవారం తెలిపారు. మార్చి 9 ఆదివారం, పిడుగురాళ్ల మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. పదో తరగతి విద్యార్థులకు వ్యక్తిగతంగా ఓఎంఆర్ సిస్టంతో స్కాలర్‌షిప్ టెస్టు జరుగుతుందన్నారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.10 వేలు, రూ.6 వేలు, రూ.3 వేలు క్యాష్ అందజేయడం జరుగుతుందన్నారు. క్విజ్‌లో 6, 7, 8 తరగతి విద్యార్థులు ఒక బృందంగా ఏర్పడి పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.6 వేలు, రూ.4,500, రూ.3 వేలు అందజేయబడునన్నారు. కన్సోలేషన్, ప్రోత్సాహక బహుమతులు ఉంటాయని తెలిపారు. మరిన్ని వివరాలకు 9963223714, 9949614674 నంబర్లను సంప్రదించాలని సూచించారు. పోటీలకు సంబంధించిన బ్రోచర్‌ను బుధవారం 75 త్యాళ్ళూరు హైస్కూల్లో విడుదల చేశారు. ప్రధానోపాధ్యాయులు ఎ.శ్రీనివాసరెడ్డి, కార్యక్రమ కో ఆర్డినేటర్ బాజీఖాన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రబీ వరి పంటలో రక్షణ చర్యలపై అవగాహన



బెల్లంకొండ: రబీలో సాగు చేసిన వరి పంటలో ఆకు చుట్టు పురుగు నివారణకు రైతులు చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి డి.కృష్ణయ్య తెలిపారు. బుధవారం మండలంలోని నాగిరెడ్డిపాలెం, గంగిరెడ్డిపాలెం గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతుల పొలాలను పరిశీలించి ఆకు చుట్టు పురుగు నివారణకు క్లోరో పై రిపోర్స్ ఎకరాకు 500 గ్రాములు లేదా కార్ టాప్ హైడ్రోక్లోరైడ్ 400 గ్రాములు చొప్పున సాయంత్రం వేళ పిచికారీ చేయాలని సూచించారు. రబీ పంట నమోదు గడువు మార్చి 6వ తేదీ వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు. ప్రతి రైతు సాగు చేసిన పంటలను నమోదు చేసుకుని ఈ కేవైసీ పూర్తి చేయించాలని సూచించారు. ఆయన వెంట వ్యవసాయ సిబ్బంది అయ్యప్ప, రైతులు పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగులకు సన్మానం



రాజుపాలెం: మండల పరిషత్ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో వివిధ శాఖలలో పనిచేస్తూ ఉత్తమ సేవలు అందించిన మహిళా ఉద్యోగులను ఘనంగా సత్కరించారు. ఏఎన్ఎం ధనలక్ష్మి, గ్రామ సచివాలయ మహిళా పోలీసు ఎస్‌కే మనీషా, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎం.జయకుమారి, బి.సంతోషకుమారి, వై.సాంబ్రాజ్యం, మండల పరిషత్ కార్యాలయంలో పని చేస్తున్న ఏవో బసవకుమారి, తహసీల్దారు కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ కవిత, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న హెచ్‌వీ ఉషారాణిలను సీడీపీవో టి.శ్రీలత, ఏసీడీపీవో టి.సంతోషకుమారిలు, సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు ఆర్‌కె రమాదేవి, బి.ప్రసన్నరాణి, ఎస్.స్వర్ణలత పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కేసులు నమోదు



క్రోసూరు: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతూ రోడ్లపై ప్రజలు, మహిళలకు ఇబ్బందులు కలిగిస్తున్న వారిని అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగేంద్రరావు బుధవారం తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగే వారిపై ఇప్పటికి 10 కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతూ ప్రజలు, మహిళలకు ఇబ్బందులు కలిగించటం, రోడ్లపై తాగి ఇష్టారాజ్యంగా మాట్లాడటం, మద్యం మత్తులో ఘర్షణలకు దిగటం, అడ్డుకోబోయిన వారిపై దుర్భాషలాడటం, దౌర్జన్యాలు చేయటం చేస్తే కేసులు నమోదు చేయటం జరుగుతుందని హెచ్చరించారు. మందు బాబులు జాగ్రత్త వహించాలని కోరారు.

నేటి నుంచి త్రిశక్తి దుర్గా పీఠంలో
శతచండీ మహాయాగం

సత్తెనపల్లి: పట్టణంలోని భవిష్య పాఠశాల సమీపంలో గల త్రిశక్తి దుర్గా పీఠంలో ఈ నెల 6 నుంచి 15 వరకు శతాధిక ప్రతిష్ఠా బ్రహ్మ, దేవి ఉపాసకులు, విశ్వధర్మ పరిరక్షణ వేదిక కోశాధికారి, పరమ పూజ్య శ్రీశ్రీశ్రీ హనుమత్‌స్వామి ఆధ్వర్యంలో పంచాయతన పూర్వక నవదుర్గాత్మక శతచండీ మహాయాగం జరుగుతుందని గణేష్ యువసేన, త్రిశక్తి దుర్గా పీఠం బ్రహ్మోత్సవ కమిటీ, మహిళా శక్తి బాధ్యులు బుధవారం తెలిపారు. ప్రతి రోజు ఉదయం చండీ పారాయణం, శతచండీ హోమం, గురువందనం, ప్రధాన దేవతార్చన, సాయంత్రం శతచండీ హోమం, లలితా సహస్ర నామార్చన, దీపార్చన, హారతి, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ జరుగుతాయన్నారు. ఈ నెల 6న గోపూజ, గణపతి పూజ, పుణ్యాహవచనం, రక్షా బంధన పూజ, కంకణ ధారణ, రుత్విక్‌వరణం, అఖండ దీపస్థాపన, మాతృకాపూజ, అంకురారోపణ, నవగ్రహ యోగిని వాస్తు క్షేత్రపాలక సహిత సర్వతోభద్ర మండల దేవత ఆవాహనలు, ప్రధాన దేవత ఆవాహన అదే రోజు సాయంత్రం అగ్ని మథనం, అగ్ని ప్రతిష్ఠ, గణపతి హోమం, లక్ష్మీ గణపతి హోమం, చతుర్వేద సేవ పూజలు జరుగుతాయన్నారు. 7న మహాలక్ష్మి, శ్రీ సూక్త, నవదుర్గ హోమాలు, చతుర్వేద సేవ, 8న సుదర్శన, లక్ష్మీనారాయణ, వాస్తు హోమాలు, 9న సౌర, అరుణ, మన్యు హోమాలు, 10న రుద్ర, మృత్యుంజయ, ధన్వంతరి హోమాలు, చతుర్వేద సేవ, 11న రామ తారక మంత్ర హోమం, ఆంజనేయ, సుబ్రహ్మణ్య, క్షేత్రపాలక మండప దేవతా హోమాలు, 12న అష్టగణపతి, చతుష్షష్టి వాస్తు హోమాలు, 13న సప్త వింశతి నక్షత్ర హోమాలు, నవగ్రహ మండప దేవతా హోమాలు, 14న బగలాముఖి, రాజశ్యామల, వారాహి, యోగిని మండప హోమాలు, 15న సర్వతోభద్ర మండప, ప్రాయశ్చిత్త, శాంతి హోమాలు, మహా పూర్ణాహుతి, శివపార్వతుల కల్యాణం, ప్రోక్షణ, వేద ఆశీర్వచనం, పండితుల సత్కారాలు, అన్న సంతర్పణ జరుగుతాయన్నారు. ఈ పూజా కార్యక్రమాలన్నీ ఆస్థాన పురోహితులు కల్వకొలను సీతారామశాస్త్రి నేతృత్వంలో జరుగుతాయన్నారు. ముఖ్య అతిథిగా సత్తెనపల్లి డీఎస్పీ మేదరమెట్ల హనుమంతరావు హాజరవుతారన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

తవ్వకాల్లో బయటపడ్డ పురాతన విగ్రహాలు



ముప్పాళ్ళలో తవ్వకాల్లో బయటపడ్డ విగ్రహాలు

ముప్పాళ్ళ: మండల కేంద్రమైన ముప్పాళ్ళలో తవ్వకాలు జరుపుతుండగా రెండు పురాతన విగ్రహాలు బయటపడ్డాయి. గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో నూతనంగా నాగేంద్రస్వామి విగ్రహం ప్రతిష్ఠించేందుకు గ్రామస్తులు చర్చించుకోగా, కొందరు పెద్దలు గతంలో జంట నాగులు విగ్రహాలు ఉండేవని, కాలక్రమేణ కనిపించకుండా పోయాయని సూచించారు. గ్రామ పెద్దల సూచనల మేరకు ఆ ప్రాంతంలో తవ్వకాలు చేపట్టగా, రెండు పురాతన విగ్రహాలు బయటపడ్డాయి. ఒకటి నాగేంద్రస్వామి విగ్రహం కాగా, మరొకటి కత్తి పట్టుకొని ఉన్న మనిషి విగ్రహం లభ్యమైంది. ఆయా విగ్రహాలపై పురాతన కాలం నాటి లిపిలో రాసి ఉంది. సుమారు 700 సంవత్సరాల క్రితం నాటి విగ్రహాలు అయి ఉండవచ్చని స్థానికులు చెబుతున్నారు. రెండు విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, రెండు ఆలయాల్లో పునః ప్రతిష్ఠించేందుకు గ్రామస్తులు చర్యలు చేపట్టారు.

వేధింపులు తాళలేక ప్రైవేటు టీచర్ బలవన్మరణం !



విద్యా స్వరూప (ఫైల్)

పెదకూరపాడు: పల్నాడు జిల్లా పెదకూరపాడు మండలం పెదకూరపాడు గ్రామానికి చెందిన గోగులపాటి విద్యా స్వరూప (34) 2016 సంవత్సరంలో పెదకూరపాడు మండలంలోని లగడపాడు గ్రామానికి చెందిన పేయ్యల సాంబశివరావును ప్రేమించి వివాహం చేసుకుంది. విద్యా స్వరూప పెదకూరపాడులోని ఓ ప్రైవేటు పాఠశాలలో టీచర్‌గా విధులు నిర్వహిస్తుంది. ఆమె భర్త సాంబశివరావు పెదకూరపాడులోని ఓ ప్రైవేటు పాఠశాల బస్సుకు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. వీరికి రుషి, ఖుషి సంతానం ఉన్నారు. గత కొంతకాలంగా వ్యసనాలకు బానిసైన సాంబశివరావు భార్యను వేధిస్తూ ఉండటంతో ఆదివారం సాయంత్రం స్వరూప ఇద్దరు పిల్లలకు పాలు తాగించి, మిగిలిన పాలలో ఎలుకల మందు కలుపుకొని తాగింది. స్వరూప, సాంబశివరావుతోపాటు, స్వరూప తల్లి వినికిడి లోపంతో ఉన్న మరియమ్మ కూడా ఇంట్లో ఉంది. అర్ధరాత్రి సమయంలో పలుమార్లు స్వరూప వాంతులు చేసుకోవడం గమనించిన చుట్టుపక్కల వారు, పక్కనే నివాసం ఉంటున్న మేనమామ శ్రీనివాసరావు విచారించగా ఎలుకల ముందు తాగినట్లు స్వరూప తెలిపింది. స్థానికులు, మేనమామ శ్రీనివాసరావు అర్ధరాత్రి సమయంలో సత్తెనపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమంగా ఉండటంతో గుంటూరు ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న స్వరూప మంగళవారం సాయంత్రం పరిస్థితి విషమించడంతో తాడేపల్లి మణిపాల్ హాస్పిటల్‌కి తరలించే క్రమంలో మృతి చెందింది.

- అయితే అంతకుముందే గుంటూరులోని ప్రైవేటు వైద్యశాల సిబ్బంది విద్యా స్వరూపను తాము ఎంఎన్‌సీ కింద ఆస్పత్రిలో జాయిన్ చేసుకున్నామని గుంటూరు కొత్తపేట పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో అక్కడి పోలీసు సిబ్బంది ఆమె వద్ద నుంచి వివరాలు తీసుకున్నారు. తాను పూర్తి స్పృహతో కడుపు నొప్పి తాళలేక ఆత్మహత్యాయత్నం చేశానని, దీనికి తన భర్త గానీ, కుటుంబ సభ్యులు గానీ కారణం కాదంటూ గుంటూరు పోలీసులకు వాంగ్మూలం ఇచ్చినట్లుగా తెలిపారు. ఈ మేరకు గుంటూరు పోలీసులు పెదకూరపాడు పోలీసులకు సమాచారం ఇచ్చారు.
- ఈ క్రమంలో విద్యా స్వరూప తల్లి మరియమ్మ పెదకూరపాడు పోలీస్ స్టేషన్‌లో తన కుమార్తెకు ఎలాంటి కడుపులో నొప్పి లేదని, అపస్మారక స్థితిలో ఉన్న తన కుమార్తె వాంగ్మూలం ఎలా ఇస్తుందంటూ, తన కుమార్తె మృతికి అల్లుడు సాంబశివరావు కారణమంటూ, అందుకు ప్రత్యక్ష సాక్షిని తానేనంటూ పెదకూరపాడు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో ఇరువురి ఫిర్యాదులను పరిగణలోకి తీసుకున్న ఎస్ఐ గిరిబాబు దర్యాప్తు ప్రారంభించారు. గుంటూరు జీజీహెచ్‌లో పోస్టుమార్టం అనంతరం మృతురాలు తల్లి మరియమ్మ కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు. పూర్తి విచారణ చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆదర్శ ఉద్యోగులను ఆదర్శంగా తీసుకోవాలి

సత్తెనపల్లి ఆర్టీసీ డిపో మేనేజర్ జీఎస్‌వీవీ కుమార్



ఆదర్శ ఉద్యోగులను సత్కరించిన ఆర్టీసీ డిపో మేనేజర్ కుమార్, ఉద్యోగులు

సత్తెనపల్లి: విధి నిర్వహణలో ఆదర్శంగా పనిచేసే ఉద్యోగులను ప్రతి ఉద్యోగి ఆదర్శంగా తీసుకోవాలని సత్తెనపల్లి ఆర్టీసీ డిపో మేనేజర్ జీఎస్‌వీవీ కుమార్ అన్నారు. పట్టణంలోని ఆర్టీసీ డిపోలో బుధవారం ఆదర్శ ఉద్యోగుల అభినందన సభలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఫిబ్రవరి మాసంలో అత్యధిక కేఎంపీఎల్ సాధించిన డ్రైవర్లు పీఎస్ నారాయణ, షేక్ సుభాని, అత్యధిక ఈపీకే సాధించిన కండక్టర్లు టీకే రావు, సీహెచ్ కోటయ్య, ఎస్ కోటిరెడ్డిలను పూలమాలలు, నగదు బహుమతితో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేఎంపీఎల్, ఈపీకే సాధించిన డ్రైవర్లు, కండక్టర్లను సహచర డ్రైవర్లు, కండక్టర్లు ఆదర్శంగా తీసుకొని మరింత కేఎంపీఎల్, ఈపీకే సాధించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, ఉద్యోగులు, అసోసియేషన్ బాధ్యులు పాల్గొన్నారు.

దుకాణాల్లో విక్రయ హక్కులకు వేలం

బెల్లంకొండ: మండలంలోని బెల్లంకొండ క్రాస్ రోడ్డు వద్ద గల కోళ్లూరు ప్రసన్నాంజనేయస్వామి ఆలయం వద్ద దుకాణాల్లో విక్రయ హక్కులను పొందేందుకు వేలం పాటలను నిర్వహిస్తున్నట్లు మండల దేవదాయ శాఖ అధికారి అవుదూరి వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఆలయం వద్ద కొబ్బరికాయలు, పూజా ద్రవ్యాలు, దేవుని బొమ్మలు, కొబ్బరి చిప్పలు, తలనీలాలు పోగు చేసుకొనుట, క్యాంటీన్ నిర్వహణ, ప్రసాదాలు అమ్ముకునే హక్కులకు వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆలయ ఆవరణలో ఈ నెల 11న వేలం జరుగుతుందని, హక్కులు పొందిన వారు ఈ ఏడాది ఏప్రిల్ ఒకటి నుంచి వచ్చే ఏడాది మార్చి వరకు విక్రయించుకోవచ్చని తెలిపారు.

ట్రాక్టర్ అదుపుతప్పి డ్రైవర్ మృతి

కారెంపూడి: ట్రాక్టర్ నడుపుతూ వ్యక్తి అదే ట్రాక్టర్ కిందపడి మృతి చెందిన ఘటన మండలంలోని ఒప్పిచర్ల శివారు రామాపురం మేజర్ కాల్వ సమీపంలో బుధవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. కాకినాడ జిల్లా నుంచి సుబాబుల్ చెట్లు నరకడానికి కూలీలు వినుకొండకు వలస వచ్చారు. అక్కడ పనులు అయిపోవడంతో నల్గొండ జిల్లా సూర్యాపేటలో పనులు చేసేందుకు రెండు ట్రాక్టర్లలో వీరు బయలు దేరారు. ఒక ట్రాక్టర్ ముందు వెళ్లిపోగా రెండవ ట్రాక్టర్ అదుపుతప్పి పొలాలలోకి దూసుకెళ్లింది. అదే టాక్టర్ కింద పడి డ్రైవర్ మృతి చెందాడు. ట్రాలీ బోల్టా కొట్టకపోవడంతో ట్రాలీలలో ఉన్న కూలీలు క్షేమంగా బయటపడ్డారు. ప్రమాదానికి కారణం తెలియడం లేదు.. ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి ట్రాక్టర్ అదుపుతప్పిందా లేక మరేదైనా కారణం ఉందో తెలియడం లేదు. మృతుడు కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం చింతలూరుకు చెందిన తాడి సత్తిబాబు (40)గా పోలీసులు గుర్తించారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ఎస్ఐ వాసు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.